క్లుప్తంగా

ముత్యంపేట సందర్శన



భవనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామాన్ని ఆదివారం అడిషనల్ కలెక్టర్ మకరంద్ సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసేందుకు పాత గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించి, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డిని అభినందించారు. డీపీవో నరేశ్, ఎంపీవో వాసవి, కార్యదర్శి స్వప్న ఉన్నారు.

కోరుట్లలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: పట్టణంలోని 16వ వార్డులోని బాబ్రీ చౌక్ వద్ద కౌన్సిలర్ బలిజ పద్మ–రాజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పోలీస్ హౌసింగ్ ఫెడరేషన్ చైర్మన్ దామోదర్‌రావు, పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు సజ్జు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: అకాల వర్షాల నుంచి పంటలు కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చిట్టాపూర్‌లో వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి వరి, నువ్వు, డ్రాగన్ ఫ్రూట్ పంటలు పరిశీలించారు. సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, ఏఈవో సాయిప్రియ, రైతులు శైలజ, లక్ష్మిరెడ్డి, రాకేశ్, సత్తయ్య, స్వామిరాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగింది



మాట్లాడుతున్న సాంబారి ప్రభాకర్

మల్లాపూర్: రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వాల్గొండ, పాతదాంరాజుపల్లి, కొత్తదాంరాజుపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లో స్వశక్తికరణ్ అభియాన్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేపీ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, నాయకులు గుండు భూమాగౌడ్, స్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పటిష్ట చర్యలు

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్‌లోని అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, పాలకవర్గసభ్యులు, అధికారులు పంచాయతీ సిబ్బందితో కలిసి హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సర్పంచ్ సరికెల లక్ష్మి, కార్యదర్శి మురళి, నాయకులు మహిపాల్ పాల్గొన్నారు.

‘పొలాలు ఎండిపోయినా పట్టించుకోలేదు’



మాట్లాడుతున్న కాయితి నాగరాజు

కథలాపూర్: మండలంలో రాళ్లవాగు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేయకపోవడంతో 400 ఎకరాలు వరిపొలాలు ఎండిపోతే పట్టించుకోని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఇప్పుడు మండలానికి ఎందుకు వచ్చారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని దుంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూరమ్మ ప్రాజెక్టు, కాలువ పనులు తమ ప్రభుత్వంతో కావని చెప్పేందుకు మండలానికి వచ్చారా అంటూ ఎద్దేవా చేశారు. కోరుట్ల–వేములవాడ రోడ్డు గుంతలమయంగా ఉందని, కథలాపూర్ మోడల్‌స్కూల్ రోడ్డు ఏళ్ల తరబడి అధ్వానంగా ఉందని చూడటానికి వచ్చారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఆకుల సంతోష్, నాయకులు ఎం.డి మోయిన్, శృంగారపు రమేశ్, ఏలేటి నవీన్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు

- అరకొర వసతులతో నిర్వహిస్తున్న వైనం
- పక్కా భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి
- అవస్థలు పడుతున్న వైద్యసిబ్బంది, మండల ప్రజలు



భూషణరావుపేటలో అద్దె గదిలో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రం

కథలాపూర్: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ పక్కా భవనాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు ఉంటే వసతులుండి, గ్రామీణ ప్రజలకు మంచి వైద్యం అందుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాలకు పక్కా భవనాలు ఎప్పుడు నిర్మిస్తారోనని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల లక్ష్యమిదే..

గ్రామీణ ప్రజలు అనారోగ్యం పాలైతే మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేవారు. గ్రామాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులను తొలగించేందుకు, గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు గ్రామాలకు ఒక ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలకు, మహిళలకు జ్వరం, దగ్గు, జలుబు వచ్చినప్పుడు ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే సిబ్బంది వైద్యసేవలు అందిస్తారు. పరీక్షించిన తర్వాత వైద్యం అందించడం సాధ్యం కాకపోతే మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీలకు రిఫర్ చేస్తారు.

మండలంలో 8 ఆరోగ్య ఉపకేంద్రాలు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. కథలాపూర్, అంబారిపేట గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 8 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో ఏ ఆరోగ్య ఉపకేంద్రాలకు ఇప్పటివరకూ పక్కా భవనం లేదు. ఆరోగ్య ఉపకేంద్రాలు కొన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, కొన్ని గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వైద్యసిబ్బందితోపాటు చికిత్స కోసం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల్లో మరుగుదొడ్లు, నీటిసౌకర్యం ఉంటే అందరికీ అనుకూలంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

స్థలం కేటాయించినం



ఆరోగ్య ఉపకేంద్రం కోసం ఏడాది కిందట స్థలం కేటాయించినం. నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కావడంలేదు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి ఆరోగ్య ఉపకేంద్రం పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి. పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మొలిగె లక్ష్మి, సర్పంచ్, తక్కళ్లపల్లి

అద్దె భవనాల్లో వైద్యసేవలు



ప్రస్తుతం అద్దె భవనాల్లో, తాత్కాలిక గదుల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్యసిబ్బందితో వైద్యం అందిస్తున్నాం. ఆయా గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యంపై వైద్యసిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులకు, గర్భిణులకు టీకా ఇస్తున్నాం.

– సింధూజ, వైద్యాధికారి, కథలాపూర్

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

- ‘మీరు నేను’ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అల్లీపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ‘మీరు నేను’ కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలం అల్లీపూర్, కుర్మపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కుర్మపల్లి గ్రామంలో రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కుర్మపల్లికి చెందిన రాజమల్లు అనారోగ్యంతో మృతిచెందగా రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఎంపీటీసీలు మోర విజయలక్ష్మి, రాజు, ఉపసర్పంచ్ సాగర్‌రావు, కోఆప్షన్ మెంబర్ మొహీద్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సారంగాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పెంబట్లలో రూ.10లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కోనాపూర్ గ్రామ శివారుల్లో రూ.5.65 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, గుర్రాల రాజేందర్‌రెడ్డి, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, ఉపసర్పంచ్ తోట లక్ష్మి, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్ ఉన్నారు.

సత్యసాయి నిత్యాన్నసేవకు స్థలం కేటాయింపు

జగిత్యాలటౌన్: జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు సత్యసాయి నిత్యాన్న సేవ కోసం ధరూర్ క్యాంపులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో స్థలంతో పాటు రూ.10లక్షల నిధులు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం స్థల కేటాయింపునకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ సత్యసాయి సేవాసమితి ప్రతినిధులకు అందజేశారు.

మాదాపూర్‌లో ‘బలగం’ ప్రదర్శన



సినిమా వీక్షిస్తున్న గ్రామస్తులు

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. కోరుట్ల జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య–రాజేశ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా సినిమా ప్రదర్శించారు.

రంజాన్ మాసం పవిత్రమైంది



బ్రదర్ షఫీని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

రాయికల్: రంజాన్ మాసం పవిత్రమైందని మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో జామా మసీదులో రంజాన్ మాసం పవిత్రను, గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ముస్లిం కమిటీ సభ్యులు మున్ను, షాకీర్, హుస్సేన్, నయీం ఆయనను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

✦దహన సంస్కారాలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో మంగళవారం అనారోగ్యంతో చింతలపెల్లి బుచ్చయ్య(70) అనే వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య, కార్యదర్శి నరేశ్‌తో పాటు వార్డుసభ్యులు తిరుపతి, నాయకులు బిట్ల నరేశ్, గుగ్లావత్ రాజేందర్ బాధిత కుటుంబసభ్యులకు గ్రామపంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కరాలకు రూ.10వేలు అందజేశారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సారంగాపూర్: మండలంలోని 18 గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ (ఆపరేషన్స్) ఏఈ సతీశ్ తెలిపారు. 33కేవీ ఫీడర్‌పై అక్కడక్కడా చెట్లకొమ్మలు ఉండి, సాంకేతికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతోందని, కొమ్మలు కొట్టివేసే కార్యక్రమం నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

✦పెగడపల్లి ఎస్సైగా కుమారస్వామి

జగిత్యాలక్రైం: జగిత్యాల వీఆర్‌లో పనిచేస్తున్న కె.కుమారస్వామిని పెగడపల్లి ఎస్సైగా నియమిస్తూ ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

✦ఉచిత వైద్యశిబిరం వినియోగించుకోవాలి

ధర్మపురి: పట్టణంలో బ్రాహ్మణ సంఘంలో 6న నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ధర్మపురి మండల ల యన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

✦ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకునేందుకు తీర్మానం

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్‌లో సర్వే నంబరు 390లో 2.23 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు తీర్మానించినట్లు సర్పంచ్ పద్మావతి తెలిపారు. గతంలో గోవిందుపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీకి చెందిన వారికి ప్రభుత్వం కేటాయించింది. కానీ ఇప్పటి వరకు వారు భూమిని వ్యవసాయ, ఇతర పనులకు కూడా వినియోగించుకోలేదు. దీంతో తిరిగి గ్రామాభివృద్ధి కోసం స్వాధీనం చేసుకునేందుకు గ్రామసభ తీర్మానించినట్లు పేర్కొన్నారు.

✦అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

వెల్గటూర్: బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు సంబంధించి వెల్గటూర్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జూపాక కిరణ్, వైస్ చైర్మన్లుగా కుషనపెల్లి రవి, బాల్లపల్లి సత్తయ్య, అల్లునూరి సతీశ్, మోకెనపెల్లి సతీశ్, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, కార్యదర్శులుగా తిరుపతి, సతీశ్, ప్రశాంత్, తిరుపతి, దుర్గయ్య, కోశాధికారిగా రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

జగిత్యాలటౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఐదువారాలుగా వైభవంగా సాగుతున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం ముగిసింది. ఆలయ అధ్యక్షులు సుధాకర్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మోహన్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఆంజనేయస్వామి ధ్వజారోహణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

కోరుట్లటౌన్: పట్టణంలోని బస్టాండ్ శ్రీఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీఆంజనేయస్వామి జయంతోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, భక్తులు స్వామిని దర్శించుకొన్నారు. నిర్వాహకులు గుంటుక జ్ఞానేశ్వర్, గాండ్లోజి రాజయ్య, అన్నం హరీశ్, గుంటుక మహేశ్, శ్యాంసుందర్, శ్రీధర్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాములు, మనోజ్, సత్యనారాయణ, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర



విజయయాత్రలో చైర్మన్, వివిధ పార్టీల నాయకులు

రాయికల్: పట్టణంలో బజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం వీర హనుమాన్ విజయ యాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ విగ్రహం నుంచి పాతబస్టాండ్, గాంధీచౌక్ వరకు శోభాయాత్ర నిర్వహించగా పార్టీలకతీతంగా కార్యకర్తలు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, విశ్వహిందూ పరిషత్ గోరక్ష ప్రముఖ్ కాయితి గంగాధర్, బజరంగ్‌దళ్ విద్యార్థి ప్రముఖ్ మనోహరచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, అసెంబ్లీ కన్వీనర్ మదన్‌మోహన్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంపై భాగంలో నిర్మించిన సమావేశ మందిరం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మొదటిసారిగా జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి సహకారంతోనే మండలానికి 2021–2022కి పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జాతీయ అవార్డు వచ్చిందన్నారు. ముఖ్యంగా మండలంలో మిషన్ భగీరథ పనులు ప్రధాన సమస్యగా మారాయని అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదంతోనే తాగునీటి భగీరథ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పలువురు సర్పంచులు విద్యుత్, తాగునీరు, ఉపాధి పనుల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ పథకాన్ని మహిళలు వినియోగించుకునేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని హెల్త్ సూపర్‌వైజర్ జక్కని దనుంజయ సభ్యులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీడీవో నీరజ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు పిడుగు రాధ–సందయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గడికొప్పుల మాధురి–గోపాల్, డీఈ గోపాల్, ఏవో నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘ భవనం ప్రారంభం

కోరుట్ల: పట్టణంలోని హనుమాన్ వ్యాయామశాల వెనుక గల అంబేడ్కర్ మాదిగ యువజన సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బలిజ పద్మ–రాజిరెడ్డి, నాయకులు కరుణాకర్, ఉయ్యాల నర్సయ్య, బలవంతుల సురేశ్, లచ్చయ్య, శనిగరపు భాగ్య, సాయమ్మ, సుజాత పాల్గొన్నారు.

వారంరోజుల్లో సమస్య పరిష్కరించాలి



అధికారులపై మండిపడుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: వారంరోజుల్లో నీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశించారు. మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోవడంపై ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ మారు సాయిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే హాజరయ్యారు. గ్రామాలకు కొన్నిరోజులుగా భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సరఫరా విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. మెట్లచిట్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా విధులకు హాజరుకాకున్నా వేతనం ఎలా చెల్లిస్తారని సర్పంచ్ శేఖర్‌రెడ్డి ప్రశ్నించగా, విచారణ జరుపుతామని సూపర్‌వైజర్ సువర్ణ తెలిపారు. సమావేశంలో ఎంపీపీ భీమేశ్‌రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్యారాణి

రాయికల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అల్లీపూర్ సర్పంచ్ గంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య సిబ్బందిని నియమిస్తే తమ వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా అలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. డెలివరీ కోసం ఫోన్ చేస్తే డాక్టర్ లేరని సమాధానం చెప్పడం సిగ్గుచేటని కొత్తపేట సర్పంచ్ బత్తిని రాజేశం వాపోయారు. సూపరింటెండెంట్ రవి మాట్లాడుతూ అలాంటి పరిస్థితులు ఏమీ లేవని, డాక్టర్లందరూ అందుబాటులో ఉన్నారన్నారు. కొత్తపేట, ఒడ్డెరకాలనీ, మూటపల్లి ఒకే ఫీడర్ ఛానల్, చింతలూరు, బోర్నపల్లి, జగన్నాథపూర్ గ్రామాలకు ఒకే ఫీడర్ ఛానల్ ఉండటంతో ఏదైనా సమస్య వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల సర్పంచులు బెక్కం తిరుపతి, అనుపురం శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో చేసిన అభివృద్ధి బిల్లులు సకాలంలో అందడం లేదని పంచాయతీరాజ్ ఏఈ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షల నిర్వహణ



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

ధర్మపురి: పట్టణంలో మంగళవారం రెండో రోజు హిందీ పరీక్షను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు చెరుకు రాజన్న, బుగ్గారపు కిశోర్ పర్యవేక్షణలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, ఇబ్రహీంపట్నం హైస్కూల్, మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ మహేశ్వర్, ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి బాలె శివాజీ మంగళవారం వేరు వేరుగా తనిఖీ చేశారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఖయ్యూం, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు దొంతి నాగరాజు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

బుగ్గారం: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ కోరారు. మండలంలోని చందయ్యపల్లెలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చల్ల రజిత, వైస్ ఎంపీపీ సుచేందర్, ఎంపీవో అఫ్జల్‌మియా, హెచ్‌ఈవో రాజేషం పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

బుగ్గారం: ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ కార్యక్రమాలపై, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కలుగుతోందని, బుగ్గారంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రాజేందర్ కోరారు. మండల కేంద్రంలో 8వ తేదీన నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనం నేపథ్యంలో మంగళవారం మండలంలోని కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్, బుగ్గారం వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచులు జగన్, రాజు, మమత, రజిత పాల్గొన్నారు.